# పెన్నేటి కతలు

"ఓర్నీ పాసుగూలా! ఒకూరి రెడ్డి ఒకూరికి పసుల పోలిగాడు! అందులో ఇది ఊరుకూడా గాదు ప్యాట[3] అయిపాయె. ఈడ నేనెవురికి తెల్సు? ఈడ నేను సొక్కా తొడుక్కోని వుంటే ఎవునిగ్గావాల? ల్యాక పోతే యెవునిగ్గావాలా? సొక్కా తొడుక్కోని వస్తే ఈ ప్యాటోళ్లు సిమ్మాసనం యేసేదీ లేదు, తొడుక్కోలేదని పోలీసోళ్లు జైల్లో యేసేదీ లేదు గదా, ఇంగ యాల సొక్కా?" — ఇట్టాటి మనిసికి సొక్కా తొడిగేది యెవురి సేతయితాది?

అయితే, సొక్కా తొడుక్కోమంటే యిట్టాటియన్నీ సెప్తావుండాడని కరె నాగయ్య యేదో గాందీ మహాత్ముడనుకునేరు, ఉత్త పనికి మాల్నోడు! వాళ్ల వాళ్లు సొక్కా కుట్టిచ్చి తొడుక్కోమని మొత్తుకొంటే, కాలికేస్తే ఏలికీ, ఏలికేస్తే కాలికీ ఏస్తా ఏడిపిస్తా వుండాడు గదా, ఎవురన్నా రొంత తెల్లసొక్కా తొడిగితే తాను ఏడుస్తాడు. ఏ మాలోళ్ల పిల్లాడో కిసుమస్సో, జనవరి పండుగో అని, సమల్లేసి సంపాయిచ్చుకొన్న లెక్కతో తెల తెల్లంగ కనపడే సొక్కా కుట్టిచ్చుకొని తొడుక్కున్నాడనుకోండి.. ఇంగ కరె నాగయ్య కంట్లో కారెం సన్నట్టే! "మాల్నా కొడుకులు గూడా తెల్ల సొక్కా లేసుకుని తిరగబడ్తే ఇంగ ఊరునాశనమే" అంటా వుంటాడు.

తనకాడ పనిజేసే వాళ్లు అడిగినా యెన్నడన్నా ఎంగిలి బీడీ యిచ్చిన పాపాన పోలా. "ఒరే బీడీ కాడ దారం కట్నారు సూడు, ఎందుకని?" అని ఆ బీడీ అడిగినోన్ని పెశ్న ఏస్తాడు. బీడీ యియ్యనోని పెశ్నకు యేం జవాబు సెప్పబుద్ది పుట్టాది? వాళ్లు సూస్తా వూరుకుంటే తనే సెప్తాడు. "బీడీకి దారం కట్టేది ఎందుకంటే ఆడి దాంకా తాగండ్రా అని. మల్ల నేను ఆడి దాంకా తాక్కుండా యిస్తే తప్పు గదా! అవతల నాకు బీడీలు పుడ్తాయా?" యిట్టా! తనను బీడీ అడిగితే యిట్ట సెప్తాడు గదా, తన్దగ్గిర ల్యాకపోతే ఏం జేస్తాడని? దావన ఎవుడు పోతాంటే వాని పిల్సి "రే, నే జెప్పినానని ఆ సెన్నయ్య అంగడి కాడికి పోయి ఒకగ్గిపెట్టె, బీడీకట్ట తీసుకొని బిరీన రాపో" అని ఆడ్డరు ఏస్తాడు.

వాని కరమగాలి ఎవడన్నా తెచ్చిపెట్టినా, "ఏం రో బీడీకట్ట, అగ్గిపెట్టె లెక్కేదీ?" అని

## కరె నాగయ్య



సెన్నయ్య తగులు కొంటాడు. "కరె నాగయ్య యియ్యాలా!" అంటే "సర్లె కరె నాగయ్య లెక్కిస్తాడా, ఎరి నా కొడకా! నా కెందుకు తీసుకపోయినోడివి మన్నే యియ్యాల" అంటాడు. కరె నాగయ్య నడిగితే "ఏ పొద్దు? యాడ జెప్పినా?" అని లచ్చ పెశ్నలేసి "అవు, నా పేరు జెప్పి తీసకరా మన్నామగానీ[4] లెక్కిస్తానంటినా?" అని అవులయకు దిగుతాడు. ఆకిరికి "యిస్తా నేరా యెదవ బీడీకట్టా అగ్గిపెట్టె లెక్కకు యింత ఆసామిని నన్ను అడుగుతారా? ఆ లెక్కకు రొంత ఆల్సెమయితే అంగడోడు సచ్చిపోతాడా, నువ్వు సచ్చిపోతావా?" అని రోసానికి పోతాడు. ఆల్సెమైతే మీరు సచ్చిపోతారా, అని అడిగినోడు యిస్తే తను సచ్చిపోతాడా అనుకోడు!

ఇయట్టా వుండంగా యింగ తిండా అంటే, యెప్పుడూ కారెం సంగటే. "వరిబువ్వ తిన్నా తిన్నట్టే వుండదు. ధూ! సంగట్లో వుండే సారం దాంట్లో యాడుండాది" అంటాడు. మల్లా ఆ ఊళ్లో యీ ఊళ్లో తనకాడ వెడ్డీలకు లెక్క తీసకపోయినోళ్ల యిండ్లకు పోయి కోడి సియ్యలూ, వరిబువ్వా గొంతుదాంకా మెక్కి వస్తాడు. అట్ట పెట్టకపోతే, అప్పిచ్చినలెక్క నాకు అక్కరుంది యియ్యమంటాడేమోని పాపం వాళ్ల బయం! అందుకని అప్పో సప్పో చేసి వాళ్లు ఆ తిండి పెడ్తారా, పెట్నారులే పాపం! అనుకోడు. "పిల్లర నాకొడుకులు, ఎచ్చులుకు పోతారు! అట్ట కర్సు సేయబట్టే వాళ్లు అట్టుండేది, కర్సు సేయకపోబట్టే తనింత సంపాయిచ్చింది" అదీ పై ఏటు!

ఎప్పుడన్నా కూలోళ్లు అంతకు ముందు యెవరికన్నా పనికి ఒప్పుకోనో, యింగేదన్నా ఇబ్బంది పడో తనగ్గానీ పనికి రాక పోతే.. సూడాల "కూల్నాకొడుకులకు కొవ్వెక్కినాది, కరువొస్తే గానీ ఈళ్ల కొవ్వు కరగదు అని తిట్లు! ఎప్పుడూ కరువొస్తానే వున్నా ఆయప్ప ఇంగా కరవు రావాలని కోరుకొంటా వుంటాడు. ఏదో ఒకేడు పండితే సాలు తన కడుపు మండిపోతాది ఇట్టా పండితే ఇంగ ఊళ్లో జనం మాట యింటారా? అని ఏడ్సి సస్తాడు. కరువొస్తే ఎక్కు వెడ్డీకి అప్పులిచ్చి తీర్సల్యాక పోతే బూములు పొరబందు[5]కోవచ్చని కరె నాగయ్య ఆలోసన!

అంత సంపాయిచ్చినా తిండి తినక గుడ్డ కట్టక యీనంగా బతికే కరె నాగయ్య న్జూసి, "ఏట్నెండా నీళ్లున్నా కుక్కకు గతుకుడు నీళ్లే గతి" అంటా వుంటారు ఊళ్లో. అంతే గాదు కరె నాగయ్యను యిప్పుడు కరువు నాగయ్య అంటా వుండారు. ఆయప్ప "కరువు రావాల, కరువు రావాల" అంటా వుంటాడని ఆ పేరు పెట్టినట్టు కనిపిస్తాది గానీ లోతున ఇంగో అర్తం వుందేమో మల్లి! ఊళ్లో అందరికీ కరువు రావాలని అనుకొంటా వుండాడుగానీ, అస్సలుకు యెప్పుడూ ఆయప్పది కరువు బతుకేగదా!

— రామకృష్ణారెడ్డి

1. ఎలుగుబంటి, 2. కుట్టుమిషన్, 3. పేట, 4. హాస్యాలకు, 5. ఆక్రమించు

23-6-1989 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక